**జరిగిన కథ :** జాయపుణ్ని అనుమకొండకు రావాల్సిందిగా మహామండలేశ్వరుడు గణపతిదేవుడి నుంచి ఆదేశాలు వచ్చినట్లు చెప్పాడు పృథ్వీశ్వరుడు. తను చెప్పేది పూర్తిగా వినకుండానే.. 'బయల్దేరతాను అన్నా..' అంటూ వెనుదిరిగాడు జాయపుడు. లోలోన రగులుతున్న అనేకానేక సంఘటనల అగ్నిపర్వతాలు పేలుతూ లావా విరజిమ్ముతుంటే.. అవి బయటికి కనిపించకుండా లోలోనే అణచుకుంటూ.. విక్రమతో కలిసి నడుస్తూ వెళ్లిపోయాడు.



# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

"స్వాగతం మహావీరా.. జాయచోడ దేవా.. స్వాగతం సుస్వాగతం!''.

అనుమకొండ నగర ప్రవేశస్థలం వద్ద నున్న ద్వారతోరణం.

స్వాగత ద్వారాలు.. దారంతా ఇరువైపులా పువ్వులతో అలంకారాలు.. వేలాది సైనికులు, పౌరులు.. ఉత్సాహంతో, ఉద్వేగంతో ఊగిపోతున్నది అనుమకొండ.

రాజధాని నగర ప్రవేశం వద్ద తనకోసం ఏర్పాటు చేసిన ఆ అట్టహాసం చూసి ఖంగుతిన్నాడు జాయచోడుడు. విక్రమపైనే కూర్చుని పరికించి చూశాడు.

తనకేనా.. ఈ స్వాగత సన్నాహాలు?!

ఏమని పిలుస్తున్నారు?!

జాయచోడ దేవుడు!! వెలనాడులో అంటే సరే.. అనుమకొండలో తను వీధిబాలుడే కదా. ఇలాంటి గౌరవవాచకం తనకు తగునా?!

లేదే.. ఇక్కడే తను తొలిసారి అనుమకొండ ప్రవేశించాడు అప్పుడెప్పుడో ముప్పైఏళ్ల క్రితం.. మల్యాలచౌండ బాబాయ గారితో. ఆరాత్రి ఇక్కడే విజయ సంబరాలు.. తమ రాజ్యాన్ని ఓడించి తన అక్కలను బంధించి తెచ్చి ఇక్కడ సంబరాలు చేసుకుంటారా?! ఆ సంబరాలు నచ్చలేదు. అందుకని మెల్లగా మత్తగజం దిగేసి నగరంలోకి అడుగుపెట్టాడు. అప్పుడే చిన్నపాటి వర్షం..

ఆ మట్టి వాసన ఇంకా మనస్సీమల తావులలో పరిమళిస్తూనే ఉంది.

ఇన్నేళ్ల తర్వాత మళ్లీ అదే తలగడదీవి నుంచి ఇదే అనుమకొండ ప్రవేశించాడు. అలాగే నడుచుకుంటూ నును వెచ్చని చల్లదనానికి చేతులు కట్టుకుని.. మళ్లీ అదే మట్టివాసనను అఘ్రాణిస్తూ వెళ్తే ఎంత బావుంటుంది!

ఎదురుగా ఈసారి తన కోసమే పెద్ద స్వాగత సంబరం.. జాయపుణ్ని చూస్తూనే మంగళవాద్యాలు మోగడం మొదలయ్యింది. విక్రమ పక్కగా నడుస్తూ గతాన్ని గుర్తుచేసుకుంటూ తోరణం లోపలికి వచ్చాడేమో.. పంచ మహావాద్యాల ఆహ్వాన సౌరభం అతన్ని నివ్వెరానందపరచింది.

నృత్త పద్ధతిలో గేయం లేకుండానే వాద్య సంగీతంతో ఆహ్వానాన్ని తెలియజేయడం.. భలే భలే.. ముచ్చట!

ఇవన్నీ తనకేనా అన్నట్లు కాకతీయ సైనిక విన్యాసాలను విభ్రమంతో చూస్తున్నాడు. ఇది సైనిక వందనం.

అఖండ భారత రాజ్యాలలోనే చెప్పుకోదగ్గ గొప్ప సైనికశక్తిగా గుర్తింపు పొందిన కాకతీయ సామ్రాజ్య సైనిక మహాపారావారంలో చిచ్చరపిడుగుగా గుర్తింపు తెచ్చుకుని.. రాజ్యరక్షణా దౌరేయులై.. అతి ముఖ్యులైన పది మంది మహావీరులలో ఒకడిగా ప్రఖ్యాతుడైన జాయచోడుడు కొంతకాలం వెలనాడు మండలీశ్వరునిగా పదవి నిర్వహించి.. రెండు సరిహద్దు రాజ్యాలు మతఘర్షణలవల్ల యుద్ధానికి సిద్ధపడితే.. వారిపై వినూత్న కళాయుద్ధం చేసి..